

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పక్కన జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

# కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

- ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తాం
- ఈనెల 3న పతాకావిష్కరణ, దవాఖానల్లో పండ్లు పంపిణీ చేస్తాం
- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

పెద్దపల్లి, మే31: కేసీఆర్ పదేండ్ల పాలన దేశానికే ఆదర్శమని పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కొనియాడారు. తెలంగాణను అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలిపిన ఘనత ఆయనకే దక్కిందని ప్రశంసించారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. పెద్దపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కండ్లముందుంన్నాయన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దండుగలా మారిన వ్యవసాయాన్ని పండుగలా తీర్చిదిద్దారని, సాగుకు 24 గంటల ఫ్రీ కరెంట్ ఇచ్చి ఆదుకున్నారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 1న, 2న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటామని, నియోజకవర్గానికి 25 మంది చొప్పున మూడు నియోజకవర్గాల నుంచి వెళ్తామని వెల్లడించారు. 3న ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా ఆఫీసులో జాతీయ, పార్టీ పతాకాలను ఆవిష్కరిస్తామని తెలిపారు. అనాథాశ్రమాలు, దవాఖానల్లో పండ్లు పంపిణీ చేస్తామని చెప్పారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రామగుండం డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు, జడ్పీటీసీ నారాయణ, పెద్దపల్లి పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, నాయకులు పెంట రాజేశ్, గోపు ఐలయ్య యాదవ్, మేడి సదయ్య, నారాయణదాసు మారుతి, మురళీధర్‌రావు, కొమురయ్య, వేణు, బీ శ్రీనివాస్, ఎన్ తిరుపతి, ఎం కొమురయ్య, బీ శ్రీనివాస్‌గౌడ్, బీ అశోక్ పాల్గొన్నారు.

# లైంగికదాడి కేసులో ఇద్దరికి 20 ఏండ్ల జైలు

జగిత్యాల అడిషనల్ సెషన్స్ కోర్టు తీర్పు

జగిత్యాల కలెక్టరేట్, మే 31 : యువతిపై లైంగికదాడి కేసులో ఇద్దరికి జగిత్యాల అడిషనల్ సెషన్ కోర్టు 20 ఏండ్ల కఠిన కారాగార శిక్ష వేసింది. ₹5 వేల చొప్పున జరిమానా విధించింది. ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో శుక్రవారం జడ్జి సుగాలి నారాయణ ఈ సంచలన తీర్పును వెలువరించారు. సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్ వివరాల ప్రకారం.. బీర్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన బాధితురాలు ధర్మపురి మండలంలోని తాళ్లధర్మారంలోని అమ్మమ్మ ఇంటికి సైకిల్‌పై తరచూ వెళ్లివచ్చేది. 2018 నవంబర్ 2న బాధితురాలు సైకిల్‌పై అమ్మమ్మ ఇంటికి వెళ్లగా ఆమె పొలం వద్ద ఉందని తెలిసింది. అక్కడికి వెళ్తుండగా గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన మేర నగేశ్, కొమిరె సాయిలు అడ్డగించారు. బలవంతంగా మామిడి తోటలోకి తీసుకెళ్లి లైంగికదాడి చేశారు. బాధితురాలు ప్రతిఘటించి బిగ్గరగా అరవడంతో పక్కన పొలంలో పనులు చేసుకుంటున్న మహేశ్ అక్కడికి వెళ్లగా నగేశ్, సాయిలు పరారయ్యారు. జరిగిన విషయాన్ని బాధితురాలు తన అన్న, అమ్మమ్మ, అక్కకు తెలుపగా, అదే రోజు రాత్రి ధర్మపురి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా ధర్మపురి అప్పటి సీఐ లక్ష్మీబాబు కేసును విచారించారు. పోలీసులు శుక్రవారం కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టిగా, అడిషనల్ పీపీ నేరాన్ని రుజువు చేశారు. దీంతో నగేశ్, సాయిలుకు 20 ఏండ్ల జైలు శిక్షతో పాటు ₹5వేల చొప్పున జరిమానా విధించారు. నేరస్తులకు శిక్షపడేలా చేసిన ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, సీఎంఎస్ ఎస్ఐ రాజునాయక్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు కిరణ్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్‌ను ఎస్పీ అభినందించారు.

# విత్తనం మంచిదేనా..!

నాణ్యమైనవే ఎంపిక చేసుకోవాలంటున్న అధికారులు • విత్తన ఎంపికపై రైతులకు సూచనలు



అల్గునూర్‌లోని ఫర్టిలైజర్ షాప్‌ను తనిఖీ చేస్తున్న ఏవో సురేందర్, ఎస్ఐ చేరాలు

పంట దిగుబడి బాగా రావాలన్నా.. మంచి లాభాలు దక్కాలన్నా.. దానికి మూలం విత్తనమే. అందుకే నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి. తక్కువకు వస్తున్నాయని కదా అని నాసిరకమైనవి కొంటే.. ఆరుగాలం శ్రమ వృథా అవుతున్నది. పంట దిగుబడి రాక, పెట్టుబడులు దక్కక రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. అయితే, విత్తనాలు కొనేముందు కొన్ని సూచనలు పాటించాలని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. నాణ్యమైన, ప్రభుత్వం గుర్తించిన కంపెనీల విత్తనాలనే కొనాలని సూచిస్తున్నారు.

\- తిమ్మాపూర్, మే 31

## పాటించాల్సిన జాగ్రత్తలు

- ప్రభుత్వం ఎంత కట్టడి చేసినా నాసిరకం విత్తనాలు విచ్చలవిడిగా వస్తుండడంతో రైతులు ముందుగా కొనుగోలు చేయడం ఆపేయాలి.
- వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ తీసుకొని అనుమతి పొందిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- దళారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయవద్దు.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచి సర్టిఫైడ్ చేసిన విత్తనాలనే ఎంచుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో విత్తన తయారీ తేదీ, గడువు తేదీ, సంస్థ పేరు, లేబుల్, విత్తనం ధర, అమ్మినవారి సంతకం, తదితర వివరాలు తప్పనిసరిగా చూసుకోవాలి.
- కొనుగోలు చేసేటప్పుడు రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి.
- బిల్లులేనిది విత్తనాలు తీసుకోవద్దు.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్రం, కొనుగోలు చేసిన రసీదును పంట చేతికి వచ్చే వరకు భద్రపర్చుకోవాలి.
- విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించాలి.

## నోటిఫైడ్.. నాన్ నోటిఫైడ్ విత్తనాలలో తేడా..

విత్తనాల్లో ప్రభుత్వ పరంగా విడుదలయ్యేవి, ప్రైవేట్ కంపెనీల నుంచి విడుదలయ్యేవి ఉంటాయి. ప్రభుత్వం రూపొందించిన రకాలు నోటిఫైడ్ పేరిట మార్కెట్లోకి వస్తాయి. ప్రైవేట్ సంస్థలు రూపొందించిన విత్తనాలు నాన్ నోటిఫైడ్ పేరిట వస్తాయి. నోటిఫైడ్ విత్తనాల నాణ్యత పంపిణీ ప్రమాణాలు 1960 విత్తన చట్టం పరిధిలోకి వస్తాయి. నోటిఫైడ్ విత్తనాల నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లయితే ఉత్పత్తిదారులు, పంపిణీ దారులపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవచ్చు.

## ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి

విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. అవి మేలురకమైన విత్తనాలేనా? అనేది పరిశీలించి కొనుగోలు చేయాలి. నాసిరకం విత్తనాలకు వ్యాపారులు ప్రచారం చేసినా, విక్రయించినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. ప్యాకింగ్, లేబుల్, ఉత్పత్తి తేదీ, తదితర వివరాలు చూడాలి. అలాగే రశీదు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్యాకెట్లు లేదా బ్యాగులు, రశీదులు పంట పూర్తయ్యేదాక వెంట ఉంచుకోవాలి.

\- జే సురేందర్, ఏవో (తిమ్మాపూర్)

# రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు



కరీంనగర్, మే 31 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ డీసీఎంఎస్ స్టోర్స్‌లో శుక్రవారం పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. మూడు రోజులుగా పచ్చిరొట్ట విత్తనాల కోసం రైతులు డీసీఎంఎస్ స్టోర్స్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న నేపథ్యంలో గురువారం 'పచ్చిరొట్ట విత్తనాలు ఎక్కడ?' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితమైంది. మూడు రోజుల వరకు విత్తనాలు రావని ప్రకటించిన అధికారులు, ఈ కథనం రావడంతో వెంటనే స్పందించారు. ప్రత్యేకంగా విత్తనాలు తెప్పించి పంపిణీ చేశారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులందరికీ అందేలా చూస్తామని వ్యవసాయ అధికారులు వెల్లడించారు.



కరీంనగర్‌లోని మార్కెట్ యార్డ్‌లో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయంలో జీలుగ విత్తనాలు తీసుకుంటున్న రైతులు



# లాలీజో.. జోలాలీ..

తల్లులు టెట్ రాయడానికి వెళ్లగా.. నెలల వయసున్న చిన్నారులను కుటుంబ సభ్యులు, తండ్రులు లాలిస్తూ.. జోల పాడుతూ మూడు గంటల పాటు వారి బాగోగులు చూసుకున్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టెట్ జరిగింది. మధ్యాహ్న సమయంలో తీవ్ర ఎండలకు చిన్నారులు ఇబ్బంది పడుతుండడంతో ఇలా చెట్లకు చీరలు, చున్నీలతో ఉయ్యాలలు కట్టి పడుకోబెట్టి జోకొట్టారు.

\- తిమ్మాపూర్, మే 31

